

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఏడో స్థానం

శ్రీకాకుళం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మీడియట్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లాకు ఏడో స్థానం లభించింది. మొత్తం 7,431 మంది విద్యా ర్థులు పరీక్షకు హాజరుకాగా ఇందులో 4,857 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 65శాతం ఉత్తీర్ణత లభించింది. ఇక రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకు ఏడోస్థానం దక్కింది. అలాగే ఒకేషనల్ పరీక్షా ఫలితాల్లో జిల్లాకు మూడో స్థానం లభించింది. ఇందులో 322 మంది పరీక్ష రాయగా.. ఇందులో 221 మంది పాస్ అయ్యారు. 69శాతం ఉత్తీర్ణత లభించింది.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, పక్కన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, జిల్లా అధికారులు



సమీక్షలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఐదేళ్లలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

- అప్పటి అధికారులే ఇప్పుడూ ఉన్నారు
- పాడుచేసిన వారితోనే బాగుచేయిస్తాం
- సమీక్షలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు
- తొలిరివ్యూలో సుతిమెత్తగా హెచ్చరించిన వ్యవసాయశాఖ మంత్రి

శ్రీకాకుళం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): 'గత ఐదేళ్లలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమైపోయాయి. అప్పుడున్న అధికారులే ఇప్పుడూ ఉన్నారు. ఎవరిపైనా కక్షసాధింపులుండవు. వ్యవస్థలను పాడుచేసిన వారితోనే బాగుచేయిస్తామ'ని రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. మంగళ వారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో కలిసి జేసీ ఎం.నీవన్ అధ్యక్షతన జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సక్ర మంగా పనిచేసిన వారిని అభినందిస్తానంటూనే.. నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవంటూ సుతిమెత్తంగా హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి న తర్వాత ఇదే తొలి సమీక్ష కాగా.. మంత్రి అచ్చెన్నాయుడు వివిధ అంశాలపై ప్రస్తావిస్తూ.. అధికారులను అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

'గత అనుభవం దృష్ట్యా అన్ని ప్రభుత్వ శాఖలపై పట్టు ఉంది. ఎక్కడెక్కడ లోపాలున్నాయో తెలుసు. ఐదేళ్ల వ్యవస్థలు దారుణంగా పనిచేశాయి. 2014 నుంచి 2019 వరకు మంత్రిగా ఉన్నా. ఆ సమయంలో ఉన్న అధికారులే ఇప్పుడూ ఉన్నారు. కానీ 2019లో ఎమ్మెల్యేగా నేను, ఎంపీగా రామ్మోహన్‌నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా బెందాళం అశోక్ గెలుపొందాం. గడిచిన ఐదేళ్లలో మమ్మల్ని ప్రజాప్రతినిధులుగా గుర్తించలేదు. జడ్పీకి వచ్చి ఐదేళ్ల ఆరు నెలలు గడుస్తోంది. ఇక నుంచి పాతవిధానానికి అధికారులు స్వస్తిపలకాలి. కలెక్టర్ నుంచి కింద స్థాయి ఉద్యోగి వరకూ.. ఎస్పీ నుంచి కానిస్టేబుల్ వరకు ప్రజలే ముఖ్యంగా విధులు నిర్వహించాలి. టీడీపీ కార్యకర్తలను కానీ, ఎవరినైనా అకారణంగా అవమానిస్తే కఠినచర్యలు తీసుకుంటాం. ప్రతి సోమవారం జిల్లాస్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల్లో ఉండాల్సిందే. రైతులకు విత్తనాలు, ఎరువులు సక్రమంగా సరఫరా చేయకపోతే చర్యలు తప్పవు. ఇరిగేషన్ కార్యాలయంలో నిర్లక్ష్యం వహించిన అధికారులను మార్పు చేస్తాం. వంశధారను మళ్లీ పరుగులు పెట్టిస్తాం. శివారు ప్రాంత భూములకు సాగు నీరందిస్తాం. అటవీశాఖ మొక్కలు నాటాలి. కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టేలా రైతు బజార్లలో అందుబాటులో అన్ని సరుకులు ఉంచాలి' అని అచ్చెన్న తెలిపారు.

ఆ డిపార్ట్‌మెంట్ ఉందా?

'మైనర్ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఉందో లేదో తెలియదు. ఎత్తిపోతల పథకాల మోటార్లను, రాగివైర్లు చోరీకి గురయ్యాయి. అధికా రులు, పోలీసులు ఏం చర్యలు తీసుకున్నారో వెల్లడిం చాలి. 24 గంటల్లో దొంగలను పట్టుకోవాలి.. దీనిపై చీమకుట్టినట్లయినా కలెక్టర్‌కు, ఎస్పీకి, ఏపీఎస్‌ఐడీసీ అధికారులకు లేదా? వీళ్లందరూ ఏం చేస్తున్నారు? ఎవరైనా తప్పుచేస్తే శిక్షపడాలి. వ్యవస్థను సరిచేయాలి' అని మంత్రి అచ్చెన్న ఆదేశించారు.

జిల్లా రూపురేఖలు మారుద్దాం

కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. 'గత ఐదేళ్లలో తప్పుడు సలహాలు.. వ్యవస్థల నిర్వీర్యంతో ప్రజలు ఎలా తీర్పుఇచ్చారో తెలుసుకదా. ప్రజల అజెండాతోనే అధికారులు విధులు నిర్వహించాలి. హద్దులు దాటకుండా ప్రజాస్వా మ్యాన్ని కాపాడాలి. ప్రజాప్రతినిధుల పోన్లకు అధికారులు స్పం దించాల్సిందే. సమష్టి కృషితో జిల్లా రూపురేఖలు మారుద్దాం. కేంద్ర పౌరవిమానయాన శాఖతో నా మార్కు ఏమిటన్నదీ దేశస్థాయిలో చూపిస్తా. భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను మూడునెలల్లో పూర్తి చేస్తాం. దేశంలో ఆంధ్రప్రదేశ్‌ను హబ్‌గా మారుస్తాం. నాకున్న పరిచయాలతో జిల్లాలో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తా. గత ఐదేళ్లలో కేంద్రప్రభుత్వం నుంచి రాష్ట్రంలో గిరిజన సంక్షేమశాఖ వినియోగించుకున్న నిధులు జీరో. జల్‌జీవన్ మిషన్ పనులు కూడా సక్రమంగా చేపట్టలేకపోయారు. ఇకపై ప్రజల కోసమే పని చేయండి. ఆరు నెలల్లో శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు పనులు పూర్తిచేయాలి' అని ఆదేశించారు.

రూ.50కోట్ల ప్రభుత్వ స్థలాన్ని.. ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషనా?

- ఇందులో కలెక్టర్ ప్రమేయముందా..?
- తక్షణమే నివేదిక ఇవ్వాలని మంత్రి అచ్చెన్న ఆదేశం

శ్రీకాకుళం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో టెక్కలి నియోజకవర్గంలో రూ.50కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేయడంపై వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జడ్పీలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు విలువైన ప్రభుత్వ స్థలాన్ని పరిశ్రమల కోసం కేటాయించాలంటూ లేఖ రాశానని గుర్తు చేశారు. ఆతర్వాత ప్రభుత్వం మారిపోయిందని, అదే స్థలాన్ని 'స్వర్ణకారుల సొసైటీ' కి అప్పగించారని, ప్రభుత్వస్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. 'ఇందులో అధికారుల ప్రమేయం ఉందా? కలెక్టర్ ప్రమేయం ఉందా? అన్నది తేలాలి. దీనిపై నివేదిక తక్షణమే కావాలి' అని ఆదేశించారు.

- 'శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు పనులను బుధవారం ఉదయం నుంచే ప్రారంభించాలని ఇప్పటికే కాంట్రాక్టరుతో మాట్లాడాను. అలాగే టిడ్కో ఇళ్లను సకాలంలో పూర్తిచేయాలి. త్వరలో లబ్ధిదారులకు అప్పగించాలి. సమగ్ర కలెక్టరేట్ భవనాన్ని ఆనాడు నేనే తీసుకువచ్చా. చంద్రబాబునాయుడు నిధులు ఇచ్చారు. అతిత్వరలో పనులు పూర్తిచేసి మొట్టమొదటగా జిల్లాలో సీఎంతో ప్రారంభిద్దాం' అని అచ్చెన్న తెలిపారు.

ఐటీఐ అడ్మిషన్ కౌన్సెలింగ్ ప్రారంభం

- తొలిరోజు 153 మందికి సీట్ల కేటాయింపు

ఎచ్చెర్ల, జూన్ 18: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం జేసీ నామినీగా జిల్లా ఉపాధికల్పనాధికారి కె.సుధ, జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు పర్యవేక్షణలో ఈ ప్రక్రియ నిర్వహించారు. ఐటీఐ ట్రేడుల్లో ప్రవేశానికి మొత్తం 2,470 మంది దరఖాస్తు చేశారు. ఈ నెల 23 వరకు రెండు షిఫ్టుల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. తొలిరోజు 413 మందిని కౌన్సెలింగ్‌కు పిలవగా 191 మంది హాజరయ్యారు. ఇందులో 153 మంది వివిధ ఐటీఐల్లో సీట్లు పొందారు. బుధవారం 414 నుంచి 877 ర్యాంకు వచ్చిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధికల్పనాధికారి కె.సుధ, ఐటీఐ కన్వీనర్ ఎల్.సుధాకరరావు మాట్లాడుతూ ఐటీఐ ట్రేడులతో తక్కువ కాలంలోనే ఉద్యోగాలు పొందే వీలుందన్నారు. విద్యార్థులు ప్రాక్టికల్‌గా ఆలోచించి సత్ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు ఐటీఐల అసోసియేషన్ ప్రతినిధి చిట్టి నాగభూషణరావు, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ సీనియర్ ట్రైనింగ్ ఆఫీసర్ కామేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థికి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న జిల్లా ఉపాధికల్పనాధికారి కె.సుధ



జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డా.షకీలా బాధ్యతల స్వీకరణ

అరసవల్లి, జూన్ 18: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ షకీలా మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఈమె జీజీహెచ్‌లోని ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ ఆఫ్ ఫిజియాలజీగా పని చేస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు.

పండగ పూట విషాదం

- సిరిమాను సంబరంలో అపశ్రుతి
- ఇద్దరు దుర్మరణం.. ఒకరికి గాయాలు

ఎచ్చెర్ల, జూన్ 18: ఎచ్చెర్ల మండలం కుప్పిలిలోని అసిరితల్లి సిరిమాను సంబరంలో అపశ్రుతి చోటుచేసుకుంది. అంతవరకు సరదాగా సాగిన సంబరంలో ఒక్కసారిగా విషాదం అలముకుంది. సిరిమానుకు చెందిన సీల ఊడిపోవడంతో.. సిరిమానును అధిరోహించిన వ్యక్తి కింద పడి గాయపడ్డారు. ఈ క్రమంలో సిరిమాను రథాన్ని మోస్తున్న ఇద్దరు దుర్మరణం చెందారు. మరికొద్ది సేపట్లో ప్రజలు మొక్కులు తీర్చుకునేందుకు సిద్ధం అవుతుండగా.. ఈ విషాదం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..

కుప్పిలిలో గ్రామదేవత అసిరితల్లి పండగను 14 ఏళ్ల తర్వాత గ్రామస్థులు జరుపుకొంటున్నారు. గత నెల 18 నుంచి వేడుకలు నిర్వహిస్తున్నారు. అనుపోత్సవంలో భాగంగా మంగళవారం సాయంత్రం సిరిమాను రథం గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. బుడగట్లపాలెం గ్రామానికి చెందిన సుమారు 100మంది సిరిమాను రథాన్ని ముందుకు లాగుతుండగా.. ఒక్కసారిగా సిరిమాను పైనున్న సీల జారిపడింది. సిరిమానును అధిరోహించిన (పైభాగంలో కూర్చొన్న) నాయన చిన్నప్పడు(కుప్పిలి) సిరిమానుతో పాటు కింద కు పడ్డారు. ఈ సమయంలో తొక్కిసలాట జరిగింది. రథం మోస్తున్న బుడగట్లపాలెనికి చెందిన సూరాడ అప్పన్న(48) అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో వ్యక్తి కారి పల్లేటి(55) తీవ్ర గాయపడి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. సిరిమానుపై కూర్చొన్న నాయన చిన్నప్పడు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు అప్పన్నకు భార్య సీతమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. మరో మృతుడు పల్లేటికి భార్య చిలకమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న వెంటనే ఎస్ఐ ఎస్.చిరంజీవి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.



కిందకు వాలిపోతున్న సిరిమాను




అప్పన్న(ఫైల్)



పల్లేటి (ఫైల్)

- అరసవల్లిలో ఉద్యోగాల పేరిట టోకరా
- ఆలయ సిబ్బంది నుంచి ఓ ఉద్యోగి వసూళ్లు
- బదిలీతో బయటపడుతున్న బాధితులు
- న్యాయం చేయాలంటూ ఈవోకు ఫిర్యాదు
- పోలీసులనూ ఆశ్రయించేందుకు సన్నద్ధం



నీకు పర్మినెంట్ గ్యారెంటీ!

(అరసవల్లి/శ్రీకాకుళం క్రైం)

అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానంలో కొంత మంది ఉద్యోగుల చేతివాటం ఆలయ ప్రతిష్ఠకు భంగం కల్గిస్తోంది. దినసరి వేతన ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామంటూ ఓ ఉద్యోగి రూ.40లక్షల వరకూ వసూళ్లకు పాల్పడ్డారు. ఇటీవల ఆ ఉద్యోగికి బదిలీ కాగా.. ఆయన అక్రమాలన్నీ బయట పడుతున్నాయి. తాము మోసపోయా మంటూ బాధితులు లబోదిబోమంటున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ఈవోకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పోలీసులను కూడా ఆశ్రయించేందుకు సన్నద్ధ మవుతున్నారు. వివరాల్లోకి వెళితే... అరసవల్లి సూర్య నారాయణస్వామి ఆలయంలో ఈవోతో సమానంగా ఓ ఉద్యోగి ఏడాదిపాటు కార్యాలయ నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించేవారు. గతంలో విశాఖలోని ఓ ఆలయంలో పనిచేసి నప్పుడు.. లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఆ ఉద్యోగి.. అరసవల్లిలోనూ అక్రమాలకు తెరతీశారు. ఆలయంలో పని చేస్తున్న కొంతమంది దినసరి వేతన ఉద్యోగులను తన గుప్పిట్లోకి తెచ్చుకున్నారు. వారికి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు వేయిస్తానని ఆశ చూపారు. తనకు వీలు కుదిరినప్పుడు కొంతమంది దినసరి ఉద్యోగులను పలుమార్లు విజయవాడ తీసుకెళ్లేవారు. అక్కడ దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో తాను చెబితే పర్మినెంట్ అయిపోతుందని నమ్మించారు. ఈక్రమంలో ఆలయంలో పనిచేస్తున్న దినసరి ఉద్యోగులు, క్షురకులు, స్వీపర్లు నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. ఈ ఏడాది జనవరి నుంచి ఈ నెల 10 వరకు 48 మంది దగ్గర మొత్తం రూ.40 లక్షల వరకూ వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా శుక్రవారం దేవదాయ శాఖ కమిషనర్ ఆదే శాల మేరకు ఆ ఉద్యోగిని విశాఖలోని మాతృశాఖకు బదిలీ చేశారు. అసలు ఆదిత్యుని ఆలయం గ్రేడ్ ప్రకారం.. ఆ ఉద్యో గిని ఇక్కడ నియమించే అవకాశమే లేదు. అయినప్పటికీ ఇక్కడ నియమించగా.. ఏడాది కాలంగా ఆయనపై వస్తున్న ఆరోపణలపై ఇప్పటికే కమిషనర్ విచారణ చేస్తున్నట్టు భోగట్టా. ఆ ఉద్యోగికి బదిలీ కావడంతో పర్మినెంట్ కోసం తాము చెల్లించిన డబ్బులు ఇక రావేమోనని దినసరి సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. తాము మోసపోయామని గ్రహించి.. న్యాయం చేయాలంటూ సోమవారం ఈవోకు 48 మంది సిబ్బంది లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

- ఆలయంలో పనిచేస్తున్న ఓ స్వీపర్ ఇటీవల ఆ ఉద్యోగికి రూ.40వేలు ఇచ్చారు. ఆ మరుసటి రోజే ఆయనకు బదిలీ అయింది. దీంతో ఆ స్వీపర్ తన డబ్బులు వెనక్కి ఇచ్చేయాలంటూ ఆలయంలోనే ఆ ఉద్యోగిని నిలదీశారు. విషయం బయటకు పొక్కుతుందనే భయంతో ఆమెకు నగదు తిరిగిచ్చేశారు. దీంతో మిగతా బాధితులు కూడా తమ డబ్బులు వెనక్కి ఇచ్చేయాలని డిమాండ్ చేయగా.. ఎలాగో బదిలీ అయిపోయిందనే ధీమాతో ఆయన తప్పించుకుని తిరుగుతున్నారు. ఫోన్‌లో కూడా అందుబాటులో ఉండక పోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసు కేసుతోపాటు, జ్యుడీషియల్ కేసు నమోదు చేసి.. తమ డబ్బులను తమకు ఇప్పించాలని ఈవోకు విజ్ఞప్తి చేశారు.

రెండురోజుల్లో వాస్తవాలు వెల్లడిస్తాం

అరసవల్లిలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో పర్మినెంట్ ఉద్యోగాల పేరిట.. ఓ ఉద్యోగి అక్రమాలకు పాల్పడ్డాడంటూ దినసరి సిబ్బంది ఫిర్యాదు చేయడం వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేయిస్తాం. రెండు రోజుల్లో వాస్తవాలు వెల్లడిస్తాం. పోలీసుస్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయాలని బాధితులకు సూచించాం. ఇదంతా మా ప్రమేయం లేకుండా జరిగింది. నాకు సమాచారం లేకుండానే.. నా కార్యాలయంలోని ఏసీని ఆ ఉద్యోగి తీసుకెళ్లి ఇంద్రపుష్కరిణి వద్ద డార్మెటరీలో అమర్చారు. విషయం తెలుసుకుని పరిస్థితిని చక్కదిద్దాం.

-ఎస్.చంద్రశేఖర్, ఈవో, అరసవల్లి

దిక్సూచి DIKSUCHI

వంద శాతం ఎంప్లాయిమెంట్ కల్పించే

ప్రింటింగ్ టెక్నాలజీ



పాలిటెక్నిక్ డిప్లొమాలు

డిప్లొమాలు కొన్ని ఎంప్లాయిమెంట్ కల్పించడంలో కల్పతరువులు అని చెప్పొచ్చు. అలాంటి వాటిలో ఒకటి ప్రింటింగ్ టెక్నాలజీ. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్‌లో మాత్రమే ఈ కోర్సు ఉంది. దీనిలో చేరడానికి పదో తరగతి పాసై తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించే పాలిసెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి. హైదరాబాద్‌లో జూ పార్కుకి సమీపంలోని కులి కుతుబ్‌షా (క్యూక్యూ) గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో మాత్రమే ఈ కోర్సును అందిస్తున్నారు.

కోర్సు తీరు తెన్నులు: ఆధునిక ప్రపంచంలో ముద్రణ మాధ్యమానికి ఉన్న విస్తృత అవసరాల దృష్ట్యా ప్రింటింగ్ టెక్నాలజీ డిప్లొమాను మూడు సంవత్సరాల కోర్సుగా రూపొందించారు. అత్యాధునిక ముద్రణ సాంకేతిక విధానాలైన offset, gravure, flexography, screen, digital ప్రింటింగ్ గురించి బోధిస్తారు. ఈ కోర్సులో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థి మూడు సంవత్సరాల్లో ఆరు సెమిస్టర్లు చదవాల్సి ఉంటుంది. మొదటి రెండు సెమిస్టర్లలో రెండు ప్రింటింగ్ సబ్జెక్టులు మినహాయిస్తే మిగిలిన సబ్జెక్టులన్నీ తతిమా అన్ని డిప్లొమాలతో సమానంగా ఉంటాయి. 3, 4, 5వ సెమిస్టర్లలో పూర్తిగా ప్రింటింగ్‌కు సంబంధించిన సబ్జెక్టులు మాత్రమే ఉంటాయి.

క్షేత్రస్థాయి అవగాహన: ఈ కోర్సు ద్వారా థియరీతోపాటు ప్రాక్టికల్స్‌లో కూడా మంచి పట్టు సాధించాల్సి ఉంటుంది. ప్రింటింగ్ టెక్నాలజీ చదువుతున్న విద్యార్థులను హైదరాబాద్‌లోని ప్రముఖ ముద్రణ సంస్థల్లో ఇండస్ట్రియల్ విజిట్‌కి తీసుకుని వెళతారు. తద్వారా పారిశ్రామిక స్థితిగతులను అవగాహన చేసుకునే అవకాశం కల్పిస్తారు. చివరి సెమిస్టర్‌లో ఆరు నెలలు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఉంటుంది. ఈ ఆరు నెలల్లో విద్యార్థి ముద్రణ రంగంలోని అన్ని విభాగాలలో పనిచేసి సంబంధిత నైపుణ్యాన్ని అలవర్చుకోవాలి. తద్వారా యంత్రాలు నడపగలిగే స్థాయికి విద్యార్థి చేరుకుంటాడు. అంతే కాకుండా నిర్వహణ సామర్థ్యానికి సంబంధించిన నైపుణ్యాలు(మేనేజ్‌మెంట్ స్కిల్స్), ఆధునిక సాంకేతికత(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్), మార్కెటింగ్ నైపుణ్యాలు(మార్కెటింగ్ స్కిల్స్)లో తర్ఫీదు పొందుతాడు.

అభిరుచికి అనుగుణంగా: ఈ కోర్సు చదివిన విద్యార్థి ముద్రణ పరిశ్రమలోని ముఖ్యమైన నాలుగు విభాగాలు ప్రి ప్రెస్, ప్రెస్ వర్క్, పోస్ట్ ప్రెస్, మార్కెటింగ్‌లలో వారి వారి ఆసక్తులను బట్టి ఎంచుకునేందుకు, సదరు విభాగాల్లో స్థిరపడేందుకు అవకాశం ఉంటుంది.

- ప్రి ప్రెస్ విభాగాన్ని డి.టీ.పి & డిజైనింగ్‌లో ఆసక్తి, నైపుణ్యం ఉన్నవారు ఎంపిక చేసుకుంటారు. ప్రెస్-వర్క్ విభాగంలో యంత్ర నిర్వాహకుడిగా, పర్యవేక్షకుడిగా పెద్ద స్థాయుల్లో అవకాశాలుంటాయి. ప్రింట్ ఫినిషింగ్‌లో బైండింగ్, ప్యాకింగ్‌పై ఆసక్తి ఉన్నవారుంటారు. మార్కెటింగ్ విభాగంలో సరైన నిర్ణయాలు, అంచనా వేయగలిగిన వారు, వినియోగదారులతో వ్యాపార సంబంధాలను నెరపగలిగిన వారుంటారు.

ఉన్నత స్థానాల్లో పూర్వ విద్యార్థులు: రిజర్వ్ బ్యాంక్ కరెన్సీ ప్రెస్‌లో ఉద్యోగం పొందాలంటే డిప్లొమా ఇన్ ప్రింటింగ్ టెక్నాలజీ తప్పనిసరి. ఈ కోర్సు చేసిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఎంతో మంది ప్రభుత్వ రంగ సంస్థలు మింటింగ్, భారతీయ రిజర్వు బ్యాంకు, ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయాలు అలాగే ప్రైవేటు రంగంలో వివిధ ముద్రణ సంస్థల్లోనూ, పత్రికారంగంలోనూ ఉన్నత స్థాయిలో ఉన్నారు. ప్రింటింగ్ టెక్నాలజీ చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ప్రింటింగ్ పరిశ్రమలలో అత్యున్నత స్థానాల్లో స్థిరపడ్డారు. అనుభవం గడించిన తరవాత కొందరు సొంతగా ప్రింటింగ్ ప్రెస్‌లు స్థాపించి అనేక మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్: క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఏటా క్రమం తప్పకుండా జరుగుతుంది. అందరూ దాదాపుగా ఏదో ఒక దగ్గర ఉద్యోగం పొందుతారు. కొద్ది సంవత్సరాలుగా విద్యార్థినుల సంఖ్య పెరగుతోంది. ప్రింటింగ్ డిప్లొమా చేసే విద్యార్థినులు ఎక్కువగా డిజైన్, పోస్ట్ ప్రెస్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలను ఎంచుకుంటుంటారు.

ఉన్నత విద్యావకాశాలు: ఈ డిప్లొమా కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈసెట్‌లో ఉత్తీర్ణత సాధించి లేటరల్ ఎంట్రీ ద్వారా ప్రింటింగ్ టెక్నాలజీలో మాత్రమే కాకుండా మెకానికల్, కంప్యూటర్స్, ఐ.టీ., ప్రొడక్షన్ ఇంజనీరింగ్‌లలో కూడా బీటెక్ చదివే అవకాశం ఉంది. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశం ద్వారా 40 శాతం విద్యార్థులు ఉన్నత విద్యను పొందగలుగుతున్నారు.

SCHOLARSHIP ALERT

Legrand Empowering Scholarship Program 2024-25



Description: Legrand invites applications from meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans pursuing B.Tech., B.E., B.Arch., or other undergraduate degrees in Finance or Science (such as B.Sc., B.Com., B.B.A., etc.) across India. The scholarship is meant to support meritorious students to pursue a career in Engineering, Architecture, Finance and Sciences.

Eligibility: The scholarship is open to meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans across India.

- Applicants must have secured admission in B.Tech., B.E., B.Arch., B.B.A., B.Com., or B.Sc. degrees in India.
- Applicants must have passed Class 12 in the year 2023–24.
- Girl students must have secured a minimum of 70% and above marks in Classes 10 and 12 examinations.
- Special category* students must have secured 60% marks in Classes 10 and 12 examinations. Exceptions may be considered on a case-by-case basis.
- The annual family income of the applicant from all sources must be less than INR 5,00,000.
- Preference will be given to special category* students.

Prizes & Rewards: Girl students are awarded 60% course fees up to INR 60,000 per year till the completion of course based on academic performance.

- Students in the special category* will be awarded 80% fees up to INR 1,00,000 per year till the completion of the course based on academic performance.

Last Date to Apply: 15-07-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/LFLS9

Aadhar Kaushal Scholarship Program for Youth with Disabilities

Description: An initiative of Aadhar Housing Finance Limited (AHFL) to ensure equal educational opportunities for all physically disabled students, irrespective of their geographical location, gender, or socio-economic condition.

Eligibility: Students with physical disabilities pursuing general or professional undergraduate courses across India. Pan-India students can apply. Students must have achieved a minimum of 60% marks in the preceding academic year. Applicants with a gross annual family income of up to INR 2.5- 3 lakh are eligible to apply.

Prizes & Rewards: Scholarship between INR 10,000 - INR 50,000

Last Date to Apply: 23-07-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/AKSP1

Raman Kant Munjal Scholarships

Description: The Raman Kant Munjal Scholarships 2024-25 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

Eligibility: Students enrolled in the first year of BBA, BFIA, B.Com. (H, E), BMS, IPM, B.A. (Economics), BBS, BBI, BAF, B.Sc. (Statistics), or any other finance-related degree courses are eligible. Applicants must have secured at least 80% marks in Classes 10 and 12. The annual family income of the applicants should be less than INR 4 lakh. Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years

Last Date to Apply: 02-08-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/RMKSP4

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/dIPEIGGలో చదవండి.



థాయ్‌లాండ్ వెళుతున్న దేవర

జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దేవర' మీదే ప్రస్తుతం అందరి దృష్టీ ఉంది. 'ఆర్ఆర్ఆర్' తర్వాత వస్తున్న తారక్ సినిమా కావడంతో ప్రేక్షకులు, అభిమానులు ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అతిలోకసుందరి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ నటిస్తున్న తొలి తెలుగు చిత్రం ఇదే కావడం మరో ముఖ్య కారణం. దర్శకుడు కొరటాల శివ ఓ అద్భుత చిత్రంగా 'దేవర'ను తీర్చిదిద్దుతున్నారు. ఇటీవలే గోవాలో ఎన్టీఆర్, సైఫ్ అలీఖాన్ మీద ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించారు. గోవాలో భారీ వర్షం కురుస్తున్నా వెనకడుగు వేయకుండా, రాజీ పడకుండా ఈ ఫైట్ చిత్రీకరించడం గమనార్హం. త్వరలో థాయ్‌లాండ్‌లో ఎన్టీఆర్, జాన్వీ కపూర్ మీద ఓ మెలోడియస్ సాంగ్‌ను చిత్రీకరించడానికి ప్లాన్ చేస్తున్నారు. యువసుధ ఆర్ట్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న 'దేవర' చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది.



గిలాసే ఎత్తేస్తే కులాసే

ప్రియదర్శి, నభా నటేష్ జంటగా నటిస్తున్న చిత్రం 'డార్లింగ్'. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా హిట్‌ను అందుకున్న కె. నిరంజన్‌రెడ్డి నిర్మిస్తున్నారు. అశ్విన్ రామ్ దర్శకుడు. ఇటీవలే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు చక్కటి ఆదరణ దక్కింది. ఇప్పుడు ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్‌ను యూనిట్ ప్రారంభించింది. 'డార్లింగ్' నుంచి తొలి గీతం 'ఖలాసే ఖాలాసే మామా నా బతుకే ఖలాసే.. గిలాసే ఎత్తేస్తే కులాసే'ను మంగళవారం విడుదల చేసింది. సామాన్యుడి బాధలను ఏకరువు పెడుతూ సాగే ఈ గీతానికి కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, వివేక్ సాగర్ స్వరాలు సమకూర్చారు. హనుమాన్ సీహెచ్, రామ్ మిరియాల ఆలపించారు. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణ తేజ్, అనన్య నాగళ్ల కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నరేశ్ రామదురై, ఎడిటర్: ప్రదీప్ ఇ రాఘవ్,

ఆ ప్రశ్నలకు సమాధానం కల్కి



ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న భారీ సైన్స్ ఫిక్షన్ ఎపిక్ 'కల్కి 2898 ఏడీ' ఈ నెల 27న విడుదల కానుంది. వైజయంతీ మూవీస్ సంస్థ అధినేత అశ్వనీదత్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ విజువల్ వండర్ రోజురోజుకీ అంచనాలు పెంచుతోంది. ప్రమోషన్స్‌లో భాగంగా 'ఎపిక్ జర్నీ వన్.. ది ప్రిల్యూడ్ ఆఫ్ కల్కి 2898 ఏడీ' ని మంగళవారం విడుదల చేశారు. ఈ వీడియోలో దర్శకుడు నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'కలియుగంలో ఏం జరుగుతుంది, ఏం జరగవచ్చు.. ఇలాంటి ప్రశ్నలకు 'కల్కి' క్లైమాక్స్ సమాధానం. కేవలం ఇండియాలోనే కాదు ప్రపంచంలో ఉన్న వారందరికీ సంబంధించిన కథ ఇది. నాకు చిన్నప్పటి నుంచి పౌరాణిక చిత్రాలు అంటే ఇష్టం. అలాగే హాలీవుడ్‌లో వచ్చిన 'స్టార్ వార్స్' వంటి సినిమాలు కూడా నన్ను ఆకట్టుకున్నాయి. అయితే ఇలాంటి సినిమాలను అక్కడే తీయాలా, మనం తీయలేమా అనిపించేది. మహాభారతంలో ఎన్నో గొప్ప పాత్రలు ఉన్నాయి. కృష్ణ నిర్యాణంతో కలియుగం ప్రారంభమైనప్పుడు ఏం జరుగుతుంది అనే సృజనాత్మక ఊహతో రాసుకున్న కథ ఇది. మనం చదివిన పురాణాలు, ఎపిక్స్. అన్నింటికీ ఈ సినిమా క్లైమాక్స్‌లా ఉంటుంది. ఒక యుగంలో రావణుడు, మరో యుగంలో దుర్యోధనుడు.. ఇలా అన్నింటిలోంచి ఓ రూపం తీసుకుని దాంతో పోరాటం ఎలా ఉంటుందన్న ఐడియాతో 'కల్కి' కథ రాయడానికి ఐదేళ్లు పట్టింది. సరికొత్తగా రూపుదిద్దుకున్న ఈ సైన్స్ ఫిక్షన్ మైథాలజీని చూసి ప్రేక్షకులు ఎలా స్పందిస్తారా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నా' అన్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, దిశా పటాని, రాజేంద్రప్రసాద్ తదితరులు ఈ చిత్రంలో నటించారు.

త్వరలోనే మీ ముందుకొస్తా



ప్రఖ్యాత గాయని, జాతీయ అవార్డు గ్రహీత అల్కా యాగ్నిక్ ఓ అరుదైన ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారు. దీని గురించి ఆమె వివరణ ఇస్తూ "కొన్నాళ్లుగా నువ్వు కనిపించడం లేదు ఎందుకని మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులు అడుగుతున్నారు. ఈ గ్యాప్‌కు కారణం.. నేను ఓ అరుదైన వినికిడి సమస్యతో బాధపడుతున్నాను. చెవికి సోకిన ఓ వైరస్ వల్ల ఏర్పడిన ఈ వినికిడి సమస్యను చికిత్సతో నయం చేయవచ్చనే భరోసాను డాక్టర్లు ఇచ్చారు. మీరు కూడా చింతించొద్దు.. ఆందోళన చెందవద్దు. త్వరలోనే నా వినికిడి శక్తిని తిరిగి పొంది.. మీ ముందుకు ఫుల్ జోష్‌తో వస్తాను. మీరు కూడా వీలైతే పెద్ద శబ్దాల నుంచి దూరంగా ఉండండి. హెడ్‌సెట్ ధరించి ఎక్కువ సౌండ్‌తో పాటలు వినడం తగ్గించండి" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు.

కొత్తదనంతో నిండిన చిత్రం



'హ్యాపీడేస్', 'కొత్త బంగారులోకం'తో లవర్ బాయ్, పక్కింటి కుర్రాడి ఇమేజ్ సొంతం చేసుకున్నారు వరుణ్ సందేశ్. తనకున్న ఆ ఇమేజ్‌కి భిన్నంగా ఆయన పూర్తి సీరియస్ రోల్‌లో నటించిన చిత్రం 'నింద'. 'కాండ్రకోట మిస్టరీ' అనేది ఉప శీర్షిక. రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు. "నేనిప్పటివరకూ ఇటువంటి పాత్రను చేయలేదు. నిజజీవితంలో ఎంతో చలాకీగా, నవ్వుతూ కనిపించే నేను.. ఇందులో చాలా సీరియస్‌గా ఉంటాను. ఒక నటుడిగా నన్ను కొత్తగా ఆవిష్కరించిన చిత్రమిది. రొటీన్‌కు భిన్నంగా సినిమాలు చేద్దామనుకొంటున్న సమయంలో ఈ కథ విన్నా. చాలా నచ్చింది. కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా 'నింద' సినిమా కథను చాలా పకడ్బందీగా రాసుకున్నారు డైరెక్టర్ రాజేశ్ జగన్నాథం. సస్పెన్స్ క్రైమ్, థ్రిల్లర్‌లలో చాలా కథలు వచ్చాయి. కానీ వాటన్నింకంటే పూర్తి భిన్నంగా ఈ సినిమా ఉంటుంది. కొత్తదనంతో నిండిన ఈ చిత్రంలో స్క్రీన్‌ప్లే చాలా గ్రిప్పింగ్‌గా ఉంటుంది. తరువాతి సన్నివేశంలో ఏం జరుగుతుందనేది ఎవరూ ఊహించలేరు" అని చెప్పారు.



టైటిల్ లోగో ఆవిష్కరించిన తేజ

దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రం టైటిల్ లోగోని దర్శకుడు తేజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమాకైనా ప్రేక్షకుల్ని ఆకర్షించేది, వారిని థియేటర్ దగ్గరకు నడిచేలా చేసేది టైటిల్ మాత్రమే. 'పోలీస్ వారి హెచ్చరిక' శక్తిమంతమైన మాస్ టైటిల్. నిర్మాతకు విజయం చేకూరాలి' అన్నారు. 'రెండు తెలుగు రాష్ట్రాల్లో షూటింగ్ పూర్తి చేశామనీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందనీ నిర్మాత బెల్లి జనార్ధన్, దర్శకుడు బాబ్జీ చెప్పారు. సన్నీ అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే, శుభలేఖ సుధాకర్, షియాజీ షిండే, హిమజ, జయవాహినీ, తులసి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: గజ్వేల్ వేణు, ఫొటోగ్రఫీ: నళినీకాంత్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.పి. సుబ్బారాయుడు.

ప్రియురాలిని పెళ్లాడుతున్న సిద్ధార్థ్ మాల్యా



వ్యాపారవేత్త విజయ్ మాల్యా తనయుడు, నటుడు సిద్ధార్థ్ మాల్యా పెళ్లి పీటలు ఎక్కనున్నారు. తన ప్రియురాలు జాస్మిన్‌ను సిద్ధార్థ్ లండన్‌లో బంధుమిత్రుల సమక్షంలో పెళ్లాడనున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఖాతాలో వారిద్దరూ కలసి తెల్లకోటు, తెల్ల గౌను వేసుకుని పెళ్లి దుస్తుల్లో ముస్తాబైన ఓ ఫొటోను పోస్ట్ చేసి "పెళ్లికి సమయం ఆసన్నమైంది. వేడుకలు మొదలయ్యాయి" అని ఆయన పేర్కొన్నారు. జాస్మిన్‌కు గతేడాది నవంబరులో తన ప్రేమను వ్యక్తపరిచిన సందర్భాన్ని.. ఇద్దరూ కలసి నిశ్చితార్థపు ఉంగరాన్ని ధరించిన ఫొటోలను సిద్ధార్థ్ మాల్యా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. దీంతో వీరిద్దరి ప్రేమాయణం గురించి అందరికీ తెలిసింది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/x2HehXX లో చదవండి.

అనుభవజ్ఞుడైన సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

టెక్కలి, జూన్ 18: వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు అధికారంలో ఉండి అన్ని విభాగాల ఖజానాను ఖాళీ చేసేశారని, ఎందులో చూసినా నిధులు లేవని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమర్థవంతమైన, అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రావడం వల్ల నాలుగైదు నెలల్లో అన్ని విభాగాలను గాడిలో పెడతారన్నారు. తనకు నలుగురు మంత్రులు నిర్వహించే శాఖలు అప్పగించారని, తద్వారా జిల్లాలో 90 శాతం మందికి న్యాయం చేసే అవకాశం లభించిందని తెలిపారు. తనకు హోంమంత్రి రాలేదని అసంతృప్తి లేదన్నారు. ఐదేళ్ల పాటు ఎన్నో కష్టాలు అనుభవించామని, వాటిని అధిగమించాలన్నారు. కేంద్రంలో రామ్మోహన్ నాయుడుకు, రాష్ట్రంలో తనకు మంత్రి పదవులు దక్కాయని, జీవితాంతం పార్టీకి, చంద్రబాబు కుటుంబానికి రుణపడి ఉంటానమని, సైనికుడిలా పని చేస్తానన్నారు. విశాఖ నుంచి నిమ్మాడకు వచ్చే ర్యాలీ 15 గంటలు తీసుకుందంటే ప్రజలు తమ కుటుంబంపై ఎంతో విశ్వాసంతో ఉన్నారని అర్థమైందని, వారి నమ్మకాన్ని వమ్ముచేయనన్నారు. ప్రతి కార్యకర్తను ఆదుకునే బాధ్యతను తీసుకుంటానని, అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు తీసుకువెళ్తానన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు కింజరాపు హరివర ప్రసాద్, బోయిన రమేష్, చౌదరి బాబ్జి, నంబాళ్ల రాజశేఖర్, వెలమల కామేశ్వరరావు, వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, కర్రి అప్పారావు, ఆనందరావు, నంబాళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


టెక్కలి: కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు


అచ్చెన్నాయుడును అభినందిస్తున్న పలాస నియోజకవర్గ టీడీపీ నేతలు

అచ్చెన్నాయుడుకు అభినందనల వెల్లువ

టెక్కలి: రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖామంత్రిగా నియమితులైన కింజరాపు అచ్చెన్నాయుడును మంగళవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో పలువురు అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు అభినందనలు తెలిపారు. రెవెన్యూ, పోలీస్, ఆర్అండ్‌బీ, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖ, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులతో పాటు ఈశ్వరీయ బ్రహ్మకుమారీలు కలిసి శాలువలు కప్పి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు. అలాగే ఉత్తరాంధ్ర గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు కూడా అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం నిమ్మాడ హైస్కూల్ విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అచ్చెన్నాయుడు పంపిణీ చేపట్టారు.

అచ్చెన్నకు టీడీపీ నేతల సత్కారం

పలాసరూరల్: రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ను పలాస నియోజకవర్గ టీడీపీ నాయకులు నిమ్మాడలో కలిసి అభినందించారు. సీనియర్ నాయకులు దువ్వాడ కృష్ణమూర్తి నాయుడు, దువ్వాడ హేమబాబు చౌదరి తదితరులు మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు. పలాస నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వారితో పాటు దువ్వాడ సంతోష్, పలాస నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి తలగాన నర్సింహమూర్తి, బూర్లె రామకృష్ణం రాజు తదితరులున్నారు.

మంత్రులను కలిసిన 'లోతుగెడ్డ'

కొత్తూరు: కేంద్ర పౌర విమానాయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడులను టీడీపీ నాయకుడు లోతుగెడ్డ వర్రప్రసాదరావు కలిశారు. మంగళవారం నిమ్మాడలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి: ఎమ్మెల్యే శిరీష

పలాస: నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు సహకరించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో శిరీషను నియోజకవర్గానికి చెందిన వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్లలో సంక్షేమం, అభివృద్ధి గాడి తప్పాయని, త్వరలో పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు అధికారులు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఐసీడీఎస్ పీఓ శార్వాణి, సిబ్బంది, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


శిరీషను అభినందిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

సారికంద సాగు.. బహు బాగు

● మార్కెట్‌లోనూ గిరాకీ
● అంతర పంటగా వేసేందుకు రైతుల ఆసక్తి

పలాసరూరల్: అంతర పంటగా సారికందను పండించడం ద్వారా లాభాలెన్నో ఉండడంతో రైతులు ఆ దిశగా ఆసక్తి కనబరుస్తున్నారు. రబీ సీజన్‌లో ఈ పంట వేయడం ద్వారా జీవనోపాధి పొందుతున్నామని రైతులు అభిప్రాయపడుతున్నారు.సారికందను కూరగా, పులుసుగా, ఫ్రై ఐటమ్స్, చిప్స్‌లుగా ఉపయోగిస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్‌లో సారికందకు డిమాండ్ ఉండడంతో రూ.50 నుంచి రూ.60 వరకు ధర పలుకుతోంది. పలాస మండలంలో మరదరాజపురం, పెదంచల, చినంచల తదితర గ్రామాల్లో ఈ పంటను రైతులు అధికంగా పండిస్తున్నారు. సుమారు 5 నెలల పాటు ఈ పంట సాగుకాలం. ఈ ప్రాంతం నుంచి గుణుపూర్, రాయగడ, బరంపురం, ఖరగ్‌పూర్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలకు తదితర ప్రాంతాలకు సారికంద రవాణా అవుతోంది. ఖరీఫ్‌లో వరి ముగిసిన అనంతరం సారికంద గింజలను వేసి ప్రత్యేక జాగ్రత్తలు చేపడతారు. ఇంటిల్లిపాదీ ఈ పంటపై కష్టపడుతూ నీటిని అందించి సాగుచేస్తుంటారు. ఈ పంటను ఒడిశాలో అధికంగా వినియోగిస్తుండగా, వీటి ఆకులు కూరగా, ఆయుర్వేదంలో వివిధ రోగాలకు మందులుగానూ ఉపయోగపడుతున్నాయి. సారికంద పంట పండే సమయంలో ఉద్యానవనశాఖాధికారులు సలహాలు అందిస్తే మరింత పంట సాగు పెరిగే అవకాశం ఉందని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


మరదరాజపురంలో కోతకు సిద్ధంగా ఉన్న సారికంద పంట

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ


విచారణ చేస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో

టెక్కలి: కోటబొమ్మాళి మేజర్ పంచాయతీలో రూ.35 లక్షల నిధులు దుర్వినియోగమైందని ఆ శాఖ పంచా యతీరాజ్ శాఖ కమిషనర్‌కు జీయన్నపేట ఎంపీటీసీ నంబాళ్ల రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టా లని కమిషనర్ ఆదే శాల మేరకు జడ్పీ డిప్యూటీ సీఈవో ఆర్.వెంకట్రామన్ మంగళవారం విచారణ చేపట్టారు. వైసీపీ ముఖ్యనేతల అండదండలతో పంచా యతీలో రూ.35 లక్షల దుర్వినియోగం అ యిందని ఆ ఫిర్యాదులో రాజశేఖర్ పేర్కొన్నారు. జడ్పీ డిప్యూటీ సీఈవో పంచాయతీ కార్యా లయంలో రికార్డులను పరిశీలించి సిబ్బంది తో మాట్లాడారు. దీంతో కోటబొమ్మాళి గ్రామపంచా యతీ కార్యాలయంలో ఒక్కసారిగా ఉలికి పాటుకు గురైంది.

విద్యార్థులకు స్కూల్ కిట్లు పంపిణీ

కొత్తూరు: మాతల గ్రామంలోని మండల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. మాతల ఎంపీటీసీ కలమట ఇందిరమ్మ విద్యా ర్థులకు కిట్లు అందించారు. క్రమశిక్షణతో చదువు కుని ఉన్నత స్థానాలను పొందాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ గొర్లె సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీటీసీ మోహన్‌రావు, గండివలస తేజేశ్వరరావు, సూర్య ప్రసాద్ జమ్మినాయుడు, పెద బాబు, రాము, సూర్యం, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


కిట్లు పంపిణీ చేస్తున్న ఇందిరమ్మ

చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం

నరసన్నపేట: దివ్యాంగులకు సామాజిక భద్రత కింద అందజేస్తున్న పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచిన సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్ర పటాలకు దివ్యాంగుల పోరాట హక్కుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం పాలభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఉన్నా సాయిగుప్త, గురువెల్లి రమణమూర్తి, నర్సింహ మూర్తి, పట్ట చిన్నబాబు, టీడీపీ నాయకులు గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, సరియ పల్లి మధు, తాళా భక్తుల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.


పాలభిషేకం చేస్తున్న దివ్యాంగులు

విజయోత్సవంలో అపశ్రుతి

నరసన్నపేట: మంత్రులుగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి విచ్చేసిన కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడుల విజయోత్సవంలో సోమవారం రాత్రి అపశ్రుతి చోటు చేసుకుంది. పట్టణంలో నిర్వహిస్తున్న ర్యాలీ సందర్భంగా స్థానిక మారుతి జంక్షన్‌లో సీఎంఆర్ షాపింగ్ మాల్ వద్ద బాణ సంచా కాల్చిన సమయంలో ఓ తారాజువ్వ మందు గుండు సామగ్రి ఉంచిన లగేజీ వాహనంలో పడింది. దీంతో మిగిలిన మందుగుండు సామగ్రి కి నిప్పు అంటుకుని ఒక్కసారి పేలాయి. దీంతో అక్కడ ఉన్నవారంతా ఆందోళనకు గురయ్యా రు. వెంటనే రిటైర్డ్ ఆర్మీకి చెందిన వ్యక్తి సీఎంఆర్ షాపులో ఉన్న అగ్ని నిరోధక యంత్రం సాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. వాహనం పాడైంది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఇదిలా ఉండగా స్థానిక జూనియర్ కళాశాల రోడ్డులో దుకాణాల వెనుక భాగంలో రాజులు చెరువులో వ్యర్థాలకు నిప్పంటుకుని మంగళవారం మంటలు వ్యాపించాయి. షాపుల సమీపంలోకి మంటలు విస్తరించడంతో స్థానికులు అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

ఇందిరానగర్‌లో ఆక్రమణలు

● పాఠశాలకు వెళ్లకుండా కంచె ఏర్పాటు

నరసన్నపేట: స్థానిక ఇందిరానగర్ కాలువ స్థలాన్ని ఆక్రమంచి అక్రమార్కులు స్తంభాలను వేసి కంచెను ఏర్పాటు చేశారు. కాలనీలోని విజ్ఞాన భారతి పాఠశాల గేటు ఎదుట దారి లేకుండా కంచె ఏర్పాటు చేశారు. ఆది, సోమవారాలు సెలువుకావడంతో మంగళవారం ఉదయం పాఠశాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు వచ్చారు. అయితే లోపలికి వెళ్లేందుకు వీలు లేకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఉండడంతో అవాక్కయ్యారు. వెంటనే పాఠశాల పాలకమండల సభ్యులు పోలీసులకు సమాచారమిచ్చి వాటిని తొలగించారు. గతంలో కూడా సదరు వ్యక్తి ఈ ప్రాంతాన్ని ఆక్రమణకు పాల్పడితే స్థానికులు అడ్డుకున్నారు. ఇందిరానగర్ కాలనీలో కాలువ ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.


పాఠశాల ఎదుట ఏర్పాటు చేసిన ఫెన్సింగ్

రెండు వలలు దగ్ధం

సంతబొమ్మాళి: మండలంలోని భావనపాడుకు చెందిన టీడీపీ నాయకుడు, మత్స్యకారుడైన గొరకల ఆదినారాయణకు చెందిన రెండు వలలు దగ్ధమయ్యాయి. సముద్ర తీరంలో ఉన్న వలలకు సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టి కాల్చేశారని బాధితుడు నౌపడ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. వీటి విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందని వాపోయాడు. ప్రస్తుతం వేట ప్రారంభమైన సమయంలో విలువైన వలలను కక్షతో కాల్చివేశారని, ప్రభుత్వం తనను ఆదుకుని న్యాయం చేయాలని బాధితుడు ఆదినారాయణ కోరారు.


దగ్ధమవుతున్న వలలు

ఘనంగా చండేశ్వరి ఉత్సవాలు

హరిపురం: మందస మండలం హరిపురంలో చండేశ్వరి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చండేశ్వరి తల్లి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బహడపల్లి, లోహరిబంద, హరిపురం గ్రామా లకు చెందిన ఆటో యూనియన్ సభ్యులు తమ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఘటాలతో ఆలయానికి వచ్చి అమ్మవారికి చల్లదనం చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మాధవరావు, కార్యదర్శి దానయ్య, చిట్టిబాబు, రామారావు, తాతారావు, కోటి, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.


చండీశ్వరీ అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

అధిక ఫీజులు వసూళ్లపై చర్యలు తీసుకోండి

కాశీబుగ్గ: లక్షలాది రూపాయలు ఫీజులను వసూలు చేస్తున్న విద్యా సంస్థలు, అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవి డిమాండ్ చేశారు. మంగళవారం కాశీబుగ్గలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు క్లోజ్ అని బోర్డులు ఏర్పాటు చేశారని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల పేర్లతో ముద్రించిన పుస్తకాలతో వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థలు రెండు, మూడు బ్రాంచ్‌లకు అనుమతులు తీసుకుని అదనం గా బ్రాంచ్‌లను నిర్వహిస్తున్నా విద్యా శాఖాధికారులు పట్టించుకోవడం లేదని విమ ర్శించారు. సీబీఎస్ఈ పేరుతో అనుమతులు లేకుండా లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటి కైనా తగు చర్యలు తీసుకుని అందరికీ అందుబాటులోకి విద్యను తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వాసుదేవురావు, పవన్, జశ్వంత్, జీవన్, సూర్య, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న నేతలు

అరుంధతీ రాయ్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి దారుణం

కాశీబుగ్గ: ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్‌ని ఉపా కింద ప్రాసిక్యూట్ చేసేందుకు ఢిల్లీ లెఫ్ట్ నెంట్ గవర్నర్ వీకే సక్సేనా అనుమతివ్వడం దారుణమని, దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని వామపక్ష నాయకులు తామాడ సన్యాసిరావు, చాపర వేణుగోపాల్, గణపతి, మాధవరావు అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. 14 ఏళ్ల కిందటి కేసులో ఇప్పుడు ప్రాసిక్యూషన్‌కు ఇవ్వడం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదన్నారు. ప్రజా సమస్యలపై గొంతెత్తితే వారిని అణచివేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ప్రాసిక్యూషన్ అనుమతిని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రముఖ విద్యావేత్త షేక్ షౌకత్ హుస్సేన్‌ను 14ఏళ్ల నాటి కేసులో ఉపా చట్టం కింద ప్రాసిక్యూషన్ చేసేందుకు అనుమతివ్వడాన్నీ ఖండిస్తున్నామన్నారు. ఇలాంటివి భావ ప్రకటన స్వేచ్ఛకు వ్యతిరేకంగా తీసుకున్న చర్యలుగా ప్రజలు గుర్తించాలన్నారు. ఇటువంటి చర్యలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు.


మాట్లాడుతున్న వామపక్ష నాయకుడు సన్యాసిరావు

తాగునీటి సమస్యను పరిష్కరించండి


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

పాతపట్నం: తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానిక బాలాజీ నగర్-2కు చెందిన మహిళలు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానికులు బొత్స నారాయణరావు ఆధ్వర్యంలో మహిళలు ఎంపీఈవో కె.రామకృష్ణం రాజును కలిసి వినతిపత్రం అందించారు. మండుటెండల్లో సైతం తాగునీటికి అల్లాడిపోయామని, ఈ విషయాన్ని టెక్కలి డీఎల్పీవో, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు, ఎంపీడీవోకు తెలిపామన్నారు. ఎన్నికల కోడ్ అంటూ పంచాయతీ ఈవో పనులు చేపట్టలేదన్నారు. తక్షణం తగు చర్యలు తీసుకుని నీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

వారం రోజులుగా నీరందడం లేదు

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలం సుభలయి కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, తక్షణం పరిష్కరించాలని స్థానిక యువకులు పంచాయతీ ఈవో వై.శ్రీరామచంద్ర మూర్తిని కోరారు. ఈ మేరకు మంగళవారం వినతిపత్రం అందించారు. సుభలయ కాలనీలో గత వారం రోజులుగా సక్రమంగా అందడం లేదని దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వీధిలైట్లు వెలగక పోవడంతో రాత్రి సమయంలో అంధకారంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. దొంగల భయంతో పాటు విష సర్పాలు సంచరిస్తున్నాయన్నారు. తక్షణం పరిష్కరించాలని వారు కోరారు.


ఈవోకి వినతిపత్రం ఇస్తున్న యువకులు

రేపు బోరుభద్రలో ఉచిత వైద్య శిబిరం

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్రలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వా హకుడు హ్యూమన్‌రైట్స్ ఆర్గనైజింగ్ సంస్థ కార్యదర్శి చింతాడ చిన్నారావు తెలిపారు. రోగులను వైద్యు లు పరీ క్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని, తీరప్రాంత వాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

నేడు చినబాడాంలో విత్తనాల పంపిణీ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ చిన బాడాం గ్రామంలో శివకేశవ ఆలయం వద్ద బుధ వారం ఉదయం 9 గంటలకు విత్తనాలను పంపిణీ చేయనున్నామని ఏవో పోలారావు ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలను రైతులకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బద్రి ఎంపీటీపీ 'మెండ' మృతి

జలుమూరు: బద్రి ఎంపీటీసీ సభ్యుడు మెండ బాలచంద్రనాయుడు (50) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఉదయం ఇంటి వద్ద స్వల్ప అస్వస్థతకు గురైన ఆయనకు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అక్కడ తుదిశ్వాస విడిచారు. శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రిలో వైద్యాధికారిగా, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ బద్రి నుంచి ఎంపీటీసీగా గెలుపొందారు. ఈయన తల్లి మెండ నాగేశ్వరమ్మ కాంగ్రెస్ హయాంలో ఎంపీపీగా వ్యవహరించారు. మృతుడికి భార్య పావని, కుమార్తె హిమజ ఉన్నారు. బాల చంద్ర నాయుడు మృతి పట్ల ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నాయకుడు ధర్మాన తేజకుమార్, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.


చంద్రనాయుడు (ఫైల్)

శ్రీముఖలింగేశ్వరాలయంలో శాంతి హోమం

జలుమూరు: సుప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగంలోని ముఖలింగేశ్వరాలయంలో మంగళవారం అర్చకులు శాంతి హోమం నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేపట్టారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో లోక కల్యాణార్థం శాంతి హోమం చేశారు. కార్యక్రమంలో ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, శ్రీకృష్ణ, చైతన్య, శివ, అప్పారావు, పలువురు దేవాలయ సిబ్బంది, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.


శాంతి హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయండి

వజ్రపుకొత్తూరు: రాజాం నుంచి అక్కుపల్లి మీదిగా వజ్రపుకొత్తూరు వరకు నిలిచి పోయిన రోడ్డు పనులను వెంటనే పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. అర్థంతరంగా నిలిచిన పనుల వల్ల రోడ్డుపై రాళ్లుతేలి ప్రమాదాలు జరిగి గాయాలపాలవుతున్నామన్నారు. రోడ్డు పనులపై ఆర్అండ్‌బీ అధికారులను అడుగుతున్నా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్‌లు సానా కృష్ణ, దున్న రమేష్ తదితరులు కోరుతున్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

హిరమండలం: జట్పీటీసీ పి.బుచ్చిబాబు ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్యాంపు కోఆర్డినేటర్ టి.రామారావు తెలిపారు. రామాలయంలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు కంటి పరీక్షలు చేస్తారని, అవసమైతే శస్త్ర చికిత్సలకు ఎంపిక చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇబ్బంది లేకుండా వ్యవహరించండి

- జడ్పీలో జరిగిన సమీక్షలో ఎంపీ, ఎమ్మెల్యేలు గత ప్రభుత్వ విధానాలపై ధ్వజం

శ్రీకాకుళం, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు వ్యవహరించాలని ఎంపీలు, ఎమ్మెల్యేలు కోరారు.ఈ మేరకు మంగళవారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో కలిసి జేసీ ఎం.నవీన్ అధ్యక్షతన జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎంపీ గత ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తారు.

ఐదేళ్లుగా నిర్లక్ష్యం



గత ఐదేళ్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. రైతులు భూముల మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకుంటే వారికి సకాలంలో పనులు చేయలేదు. ఇప్పటికైనా వ్యవస్థలను కాపాడాలి. నేను రైతుల తరఫున అధికారులతో ఫోన్‌లో మాట్లాడినా సంబంధిత సిబ్బంది స్పందించలేదు. ఇకపై పేదలకు, రైతులకు ఇబ్బందుల్లేకుండా అధికారులు వ్యవహరించాలి.

- కలిశెట్టి అప్పలనాయుడు, ఎంపీ, విజయనగరం

చర్యలు తీసుకోవాలి



గత ఐదేళ్ల అధికారులు సాగునీరు అందించలేకపోయారు. కనీసం కాలువలకు షట్టర్లను కూడా అమర్చలేకపోయారు. ఇటువంటివారిపై చర్యలు తీసుకోవాలి. ఎత్తిపోతల పథకాల్లో రాగివైర్లను తీసేసిన వారిపై రెండురోజుల్లో కఠిన చర్యలు తీసుకోవాలి.

- బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే, నరసన్నపేట

ఐటీడీఏ నిర్వీర్యం



పలాస నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాలు ఐటీడీఏ పరిధిలో ఉన్నాయి. గత ఐదేళ్లలో ఒక్క సమావేశం నిర్వహించలేదు. ఐటీడీఏ వ్యవస్థే నిర్వీర్యం చేసేశారు. పలాసలో అనుమతి లేకుండా కొండలనే తినేశారు. వజ్రపుకొత్తూరు మండలంలో శివారుభూములకు సాగునీరు ఇవ్వలేదు. కనీసం కాలువలను కూడా బాగుచేయలేదు. ఉద్దానం, శాసనం ప్రాజెక్టులను అటకెక్కించేశారు. వీటిపై సమీక్ష నిర్వహించాలి.

- గౌతు శిరీష, ఎమ్మెల్యే, పలాస

ఆ భూములు రిజిస్ట్రేషన్



వంశధార రిజర్వాయర్ మిగుల భూములను వైసీపీ నాయకులు రిజిస్ట్రేషన్ చేయించేసుకున్నారు. పాతపట్నం ఆర్టీసీ స్థలాన్ని ఆక్రమించారు. ఎస్టీ రైతులకు విత్తనాలు అందడంలేదు. గతంలో పంపిణీ చేసిన ఇళ్లస్థలాలపై దర్యాప్తు చేయాలి. నియోజకవర్గంలో ప్రజలకు తాగునీరు అందించాలి.

- మామిడి గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం

చెడ్డపాలనగా ముద్ర



ఐదేళ్ల చెడ్డపాలనగా ముద్రపడిపోయింది. అందుకే అధికారుల వైఖరి మారాలి. పోలీసులు ప్రజా సంరక్షకులన్నది గుర్తించుకోవాలి.క్రూరంగా మాట్లాడకూడదు. భాష సవరించుకోవాలి. రెవెన్యూ అధికారులపై అవినీతి ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి.

-వేపాడ చిరంజీవి, ఎమ్మెల్సీ

గతంలో బెదిరించారు



సామాన్యుల పనుల కోసం కార్యాలయాలకు వెళ్లినా.. వారితరుపున మాట్లాడినా గతంలో బెదిరించేవారు. పట్టాదారు పాసుపుస్తకం కోసం వెళ్లినా రైతులకు ఇబ్బందులే. గతంలో అడ్డదిడ్డంగా పనిచేసినవారు ఇప్పుడు మీరు ఎలా చెబితే అలా చేస్తామంటున్నారు. ఇప్పటికీ గ్రామాల్లో తాగునీరు లేదు. 2019 నుంచి సాగునీటి కాలువలను మరమ్మతులు చేయలేదు. పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు లేవు. చిన్నచిన్న ప్రైవేటు ఉద్యోగాలను కూడా అమ్ముకుంటున్నారు.

- నడుకుదిటి ఈశ్వరరావు, ఎమ్మెల్యే, ఎచ్చెర్ల

బాధ్యతగా వ్యవహరించాలి



ప్రజాప్రతినిధులు ఫోన్ చేస్తే అధికారులు స్పందించాలి. బాధ్యతగా పనిచేయాలి. 2019 నుంచి నగరంలో కేఆర్ స్టేడియాన్ని మరింత నాశనం చేసేశారు. అక్కడ వాకింగ్‌కు వస్తున్న మహిళల కోసం రెండు మరుగుదొడ్లు నిర్మిస్తామని నేను చెప్పినా డీఎస్‌డీవో వద్దు అంటున్నారు. నగరమంతటా పారిశుధ్యం చక్కదిద్దాలి. గ్రంథాలయ భవనానికి మరమ్మతు చేయాలి.

- గొండు శంకర్, ఎమ్మెల్యే, శ్రీకాకుళం

పీహెచ్‌సీ భవనం కొండపై నిర్మిస్తారా..?: అచ్చెన్న

'నిమ్మాడ మా సొంత ఊరు. అక్కడి ప్రజల కోసం టీడీపీ ప్రభుత్వంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మంజూరు చేయించుకున్నా. భవనం మంజూరైంది.అనంతరం ప్రభుత్వం మారింది. కనీసం ఎమ్మెల్యేగా నాకు, ఎంపీగా రామ్మోహన్‌నాయుడుకు సమాచారం ఇవ్వలేదు. పీహెచ్‌సీ భవనాన్ని ప్రజలకు ఉపయోగం లేకుండా మరొక పంచాయతీలో కొండపై నిర్మించారు. ఇప్పుడు అక్కడకు ఎవరూ వెళ్లలేకపోతున్నారు. ఇలా చర్యలు తీసుకున్న వారిని జైళ్లో పెడితే కానీ బుద్ధిరాదు. ప్రజాప్రతినిధులు ఏం చెప్పినా నిబంధనలు లేకుండా అధికారులు ప్రవర్తిస్తే ఎలా? అందుకే టెక్కలిలో విలువైన స్థలం ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేయించనివారి వివరాలు, పీహెచ్‌సీ భవనాన్ని కొండపై నిర్మించిన వారి వివరాలను పూర్తిస్థాయి నివేదికగా నాకు అందజేయాలి. ఒకరిద్దరిపై కఠిన చర్యలు తీసుకుంటేనే వ్యవస్థలు చక్కబడతాయి' అని అచ్చెన్న సమావేశంలో పేర్కొన్నారు.

డీఎస్‌డీవో గా అన్‌ఫిట్...

కేఆర్ స్టేడియంలో అక్కడకు వస్తున్న వాకర్స్ కోసం శ్రీకాకుళం ఎమ్మెల్యే స్వయంగా మరుగుదొడ్లు నిర్మిస్తామన్నా వాటిని అడ్డుకోవ డమేంటి? డీఎస్‌డీవోగా అన్‌ఫిట్. గతంలో నేనే డీఎస్‌డీవోను తెచ్చాను. జగన్మోహన్‌రెడ్డిలా 500కోట్లతో భారీప్యాలెస్ ఏమీ నిర్మించలేదుగా. ప్రజా ప్రయోజనం కోసమే మరుగుదొడ్లు నిర్మిస్తే అడ్డుపడతావా? పదిమందికి ఉపయోగపడేలా ప్రజాప్రతినిధులు చర్యలుతీసుకుంటే అడ్డుపడటం, ప్రభుత్వానికి నష్టం కలిగించేలావ్యవహరించడం క్షమించరానిది' అని అచ్చెన్న ఆగ్రహం వ్యక్తం చేశారు.



మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులకు జ్ఞాపికలు అందజేస్తున్న అధికారులు

దొంగతనం కేసులో నలుగురి అరెస్టు

సోంపేట: దొంగతనంలో కేసులో గజపతినగరంలోని ఒకే కుటుంబానికి చెందిన నలుగుర్ని అరెస్టుచేసినట్లు ఎస్ఐ హైమావతి తెలిపారు. బారువ నుంచి సోంపేట ఆటోపై వస్తున్న సీపాన రోహిణి చెందిన సామగ్రి సోమవారం రాత్రి దొంగిలించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితులను గుర్తించి సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. గజపతినగరంలోని ఒకే కుటుంబానికి చెందిన వారు ఈ దొంగతనానికి పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు.

భారీ వాహనాలతో ట్రాఫిక్ పాట్లు

- అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై వాహనచోదకుల అగచాట్లు



ప్రధాన రహదారిపై నిలిచిపోయిన ట్రాఫిక్

సరుబుజ్జిలి:అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై భారీవాహనాలు రాకపోకల వల్ల నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతోంది. శ్రీకాకుళం నుంచి సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట, హిరమండలం, కొత్తూరు, పాతపట్నం, ఒడిశాలోని పలు ప్రాంతాలకు నిత్యం రాకపోకలతో ఈ రోడ్డు రద్దీగా ఉంటోంది. సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ నుంచి జంక్షన్ వరకు ప్రధాన రహదారిలో భారీ గుంతల ఏర్పడ్డాయి. మూడేళ్లుగా సాధారణ పూడ్చి వేత పనులు కూడా రోడ్లు భవనాల శాఖ అధికారులు చేపట్టకపో వడంతో ప్రతిరోజూ భారీ వాహనాలు గుంతల్లో ఇరుక్కొని ట్రాఫిక్ స్తంభించిపోవడంతో అగచాట్లు తప్పడం లేదని వాహనచోదకులు, ప్రయాణికులు వాపోతున్నారు. ఒడిశా నుంచి విశా ఖపట్నం వంద లాది భారీలారీల్లో ప్రతిరోజూ ఇసుక తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏబీ రహదారిపై ఉన్న భారీ గుంతలో లారీలు ఇరుక్కుపోవడంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందిపడ్డారు.

రాబోయే కాలమంతా మధ్యవర్తిత్వానిదే

- జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా



మాట్లాడుతున్న జునైద్ అహ్మద్ మౌలానా

గుజరాతీపేట:రానున్న కాలమంతా మధ్యవర్తిత్వంపై ఆధారపడి ఉంటుందని జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టుల సముదాయంలో జిల్లాలో ఎంపిక చేసిన న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ ఐదు రోజులపాటు నిర్వహించేందుకు శ్రీకారంచుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు న్యాయాధికారులకు ఎక్కువ సమయం కేటాయించే అవకాశం తక్కువ ఉంటుందని తెలిపారు.శిక్షణ తీసుకున్న మధ్యవర్తిత్వ న్యాయవాదికి కక్షిదారుల పూర్తిసమాచారాన్ని తెలుసుకునేలా అవకాశముందని,తద్వారా సమస్యను త్వరితగతిన పరిష్కరించవచ్చని చెపాపరు. కార్యక్రమంలో అధ్యక్షులు పీఎల్‌ఏపీయూఎస్ జీజీసువర్ణరాజు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ట్రైనర్ జి.శషిదేవి, సుదర్శన సుందర్ పాల్గొన్నారు.

టైట్లింగ్ యాక్ట్ రద్దుపై సంబరాలు



యాక్ట్ రద్దుపై ఆనందం వ్యక్తంచేస్తున్న న్యాయవాదులు

ఆమదాలవలస: రాష్ట్రంలో వైసీపీప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ కూటమి ప్రభుత్వం రద్దు చేయడంపై ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు మంగళవారం సంబరాలు నిర్వహించారు. ఈ మేరకు స్థానిక బార్ కౌన్సిల్ కార్యాలయంలో అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మి ఆధ్వర్యంలో న్యాయవాదులు కేక్‌ను కట్‌చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పైడి వరహా నరసింహం, బొడ్డేపల్లి మోహన్‌రావు, తమ్మినేని అన్నంనాయుడు, గురుగుబిల్లి వెంకటరావు, బి.సీతారాం, జి.ప్రభాకరరావు పాల్గొన్నారు.

విత్తనాలు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

బూర్జ: రైతులకు ఖరీఫ్‌లో ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ దివ్య కోరారు. మంగళవారం బూర్జ మండల పరిషత్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రాఘువేంద్రబాబు సూచించారు.సమావేశంలో వైస్ ఎంపీపీ సూర్యారావు, కృష్ణమూర్తి, సర్పంచ్‌లు గోపి, గణపతి, రాజు, ఎంపీటీసీ పోలినాయుడు పాల్గొన్నారు.

వలంటీర్లతో రాజీనామా చేయించినవారిపై కేసులు పెట్టండి

- ఇది స్టేట్ ఇష్యూ.. త్వరలో నిర్ణయం తీసుకుందాం: మంత్రి అచ్చెన్న

ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం: వలంటీర్లతో ఎన్నికల ముందు రాజీనామా చేయించినవారిపై కేసులు పెట్టాలని, ఈ విషయంపై ఫిర్యాదుచేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ముందు ఎక్కువ మంది వలంటీర్లు వైసీపీ నాయకుల ఆదేశాలతో రాజీనామాచేశారు. వారంతా మంగళవారం శ్రీకాకుళంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరం గేటు వద్ద ప్లకార్డులతో రాజీనామా చేసిన వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని ప్రదర్శించారు. సమీక్ష అనంతరం మంత్రి వాహనంలో వెళ్తూ.. అక్కడ ఆగారు. ఇది స్టేట్ ఇష్యూఅని తెలిపారు. అసలు వలంటీర్లతో రాజీనామా చేయాలని చెప్పినవారిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులివ్వాలని, బలవంతంగా రాజీనామా చేయించారని పోలీసులకు వివరించాలని మంత్రి తెలిపారు. త్వరలో నిర్ణయం తీసుకుందామని వారికి చెప్పి వెళ్లిపోయారు.

ఎక్సైజ్‌శాఖ సమస్యలపై దృష్టిసారిస్తాం

శ్రీకాకుళం క్రైం: ఎక్సైజ్‌శాఖలో ఉన్న సమస్యలపై దృష్టిసారిస్తామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచెన్నాయుడు తెలిపారు. మంగళవారం జిల్లా పరిషత్‌కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ ఎంవీ గోపాలకృష్ణ, సీఐలు రామచం ద్రకుమార్, రాజారావు, గాయత్రి, కానిస్టేబుల్ యూనియన్ నాయకుడు మోహన్ తదితరులు కలిసి మంత్రిని అభినందించారు. వారుఅచ్చెన్నకు సమస్యలపై వినతిపత్రం అందించారు. టీడీపీ హయాంలో ఉన్న పాత అబ్కారీ విధానాన్ని తీసుకొచ్చి ప్రజల ఆరోగ్యానికి, ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడును కోరారు. ● శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచెన్నాయుడులను ఎస్పీ జీఆర్ రాధిక కలుసుకున్నారు.

ట్రిపుల్ ఐటీ అభివృద్ధికి సహకరించాలి

ఎచ్చెర్ల: ట్రిపుల్ ఐటీ అభివృద్ధికి సహకరించాలని క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ కోరారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళంలో కేంద్ర పౌరవిమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును కలిశారు. క్యాంపస్‌లో చేపడుతున్న కార్యక్రమాలు, వసతులు తదితర విషయాలను మంత్రికి వివరించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి ముని రామకృష్ణ, డీన్లు మోహనకృష్ణ చౌదరి, అసిరినాయుడు, రవి పాల్గొన్నారు.

● **అరసవల్లి:** జిల్లా ఎన్టీఆర్, మోక్షజ్ఞ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు మాదారపు వెంకటేష్, సేవాసంఘం అధ్యక్షుడు మాదారపు డేవిడ్, సభ్యులు ప్రదీప్, సురేంద్ర, ప్రసాద్, రాజు, మహేష్, ఉదయ్ సతీష్, దిలీప్, జనార్దన్ తదితరులు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా డేవిడ్ బృందం చేస్తున్న సేవా కార్యక్రమాలకు అభినందించారు.

టీడీపీ నాయకులకు లోకేష్‌కు అభినందన

పొందూరు:మానవవనరులశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను మంగళవారం ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో మండల టీడీపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పార్టీ విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు లోకేష్ అభినందించారు. ఈ కార్య క్రమంలో టీడీపీమండలాధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, బలగ శంకరభాస్కర్, పి. రామారావు, సువ్వారి మధు, జాడ మురళి, పి. కృష్ణారావు పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న ఆపస్ సభ్యులు

ఇచ్ఛాపురం: పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.శంకరం, ఎం.తారకేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సోమేశ్వరరావ కోరారు. ఈ మేరకు మంగళవారం సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఇచ్ఛాపురంలో ఎమ్మెల్యే అశోక్‌ను కలిసి ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.జీవో- 117రద్దుచేసి మళ్లీ ప్రాథమిక పాఠశాలల పూర్వ వైభవం తీసుకురావాలని, సకాలం లో డీఏ,ఐఆర్ బకాయిలు చెల్లించి కొత్త పీఆర్సీ అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో చదివే వారికి మాత్రమే అమ్మకు వందనం వర్తింపజేయాలని కోరారు.

మంత్రి కొండపల్లిని కలిసిన ఎన్ఈఆర్

రణస్థలం:మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఎచ్చెర్ల శాసనసభ్యుడు నడుకుదిటి ఈశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టడంతో ఆయనకు అభినందనలు తెలిపారు. అలాగే శ్రీకాకుళం జడ్పీ కార్యాలయంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఎస్పీ జీఆర్ రాధికను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఘనంగా గొండు శంకర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: శ్రీకాకుళం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గొండు శంకర్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శంకర్‌ను టీడీపీ శ్రేణులు, అభిమానుల శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత కార్యాలయ ఆవరణలో గల నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నగర, గ్రామీణ, గార మండలాల నుంచి వచ్చిన నాయకులు, అభిమానులు మధ్య కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో నగర పార్టీ, అనుబంధ విభాగాల నాయకులు, డివిజన్ ఇన్‌చార్జిలు, గ్రామీణ, గార మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

జిల్లాలోని పలు చోట్ల గ్రామదేవతలకు సంబరాలు నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం ప్రత్యేక పూజలుచేశారు. మహిళలు ఘటాలతో ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లిలంచారు.

పెద్ద మతలబుపేటలో నీలమ్మతల్లికి..

సరుబుజ్జిలి:మండలంలోని పెద్దమతలబుపేటలో నీలమ్మతల్లి సంబరాలను మంగళవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. పూర్వీకుల నుంచి ప్రతిఏటా జూన్ 18న నీలమ్మతల్లి సంబరాన్ని నిర్వహించి ఖరీఫ్ పనులు ప్రారంభించడం గ్రామంలో ఆన వాయితీగా వస్తోందని గ్రామస్థులు తెలిపారు. సంబరం నిర్వహించే రోజు గ్రామానికి చెందిన వ్యక్తులు ఏ ప్రాంతంలో ఉన్నా ఆ రోజుకు గ్రామానికి చేరుకోవాలి. ప్రతి కుటుంబానికి చెందిన బంధువులు కూడా పండగకు హాజరై పార్టీలకతీతంగా అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో భోజన కార్యక్రమం నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకత.

చెవిటిపోలమ్మ అసిరితల్లికి ముర్రాటలు

జి.సిగడాం:పెంటలో వెలసియున్న చెవిటిపోలమ్మ అసిరితల్లికి మంగళవారం వందలాది మంది మహిళలు ముర్రాటలు చెల్లించారు. ఈ నెల 21 నుంచి 23 వరకు గ్రామంలో దుర్గాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవ యాత్ర మహోత్సవాలు పురస్కరించుకొని తొలుత గ్రామదేవతకు మేళతా లాలు, మంగళ వాయిద్యాలు నడుమ అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలతో పాటు ముర్రాటలు సమర్పించారు.గ్రామంలో ప్రతిఇంటి నుంచి భక్తులు బయలుదేరి బండార్లమ్మతల్లికి, నీలమ్మతల్లికి, చెవిటిపోలమ్మతల్లికి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఈ నెల 23 నుంచి 25 వరకు అభయాంజనేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవ యాత్రా మహోత్సవాలు కూడా నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.కార్యక్రమంలో ఆలయధర్మకర్తలు మక్క రామారావు, రామ లక్ష్మి దంపతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మోహినీ భద్రాంబికా అనుపోత్సవం

గార: శ్రీకూర్మంలో శ్రీమోహినీ భద్రాంబిక అమ్మవారి అనుపోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది.గ్రామం వివిధ ప్రాంతాలు నుంచి వేలాది మంది మహిళలు పూర్ణకలశాలను మేళతాళాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు.అమ్మవారికి పూర్ణ కలశాలతో చల్లదనం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే

అరసవల్లి: వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మంగళవారం సింగుపురం ఆర్బీకె-3లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 80 క్వింటాల వరి విత్తనాలు విత్తనాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వరిప్యాకెట్ రూ.1194లు కాగా, ప్రభుత్వ సబ్సిడీ రూ.300లు మినహాయించి క్వింటాలకు రూ.894లు మాత్రమే చెల్లించాలని తెలిపారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏడీఏ బగ్గు రజని, వ్యవసాయాధికారి ఎం.ఉషాకుమారి, ఏఈవో నాయుడు, వీఏఏ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● **సోంపేట:** బారువ రైతుభరోసా కేంద్రంలో రైతులకు విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దు కుమార్, దున్న సత్యం, సానా రాజేష్‌కన్నా, దండాసి మహేశ్వరరావు పాల్గొన్నారు.

●**సరుబుజ్జిలి:** ఖరీఫ్ సాగు చేసే ప్రతి రైతుకు వరి విత్తనాలు సబ్సిడీపై అందాలని తెలుగు యువత మండలాధ్యక్షుడు తాడేల రాజారావు కోరారు. రొట్టవలస రైతు భరోసా కేంద్రంలో ఏవో బి.పద్మనాభం ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తాడేల వెంకటరమణ, మూడడ్ల రమణ, పలువురు టీడీపీ నాయకుల పాల్గొన్నారు.

●**బూర్జ:** మండలంలోని పెద్దపేటలో రైతులకు జడ్పీటీసీ మాజీ సభ్యుడు అన్నెపు రామకృష్ణంనాయుడు విత్తనాలను పంపిణీ చేశారు. కార్య క్రమంలో వ్యవసాయాధికారి రాజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవో-117ను తక్షణమే రద్దుచేయాలి

పొందూరు: ఉపాధ్యాయులకు తీవ్రనష్టం చేస్తున్న 117 జీవోను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం. రమణరావు, తేజేశ్వరరావు కోరారు.మంగళవారం పొందూరులో సంఘ సమావే శం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కె. విజయ్‌కుమార్, డి. శ్రీని వాసరావు, పి. తిరుమలరావు, బి. సతీష్, డి. రవికుమార్ పాల్గొన్నారు

సికిల్‌సెల్ వ్యాధిపై అవగాహన ఉండాలి

సరుబుజ్జిలి:సికిల్‌సెల్ అనీమియావ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాహితీప్రియదర్శిని తెలిపారు. మంగళవారం మండలంలోని వెన్నలవలస గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సికిల్‌సెల్ అనీమియా దినోత్సవం పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మోహన్‌రావు, పాల్గొన్నారు.

పథకాలతో రైతులకు తోడ్పాటు: జేసీ

ఆమదాలవలస: ప్రభుత్వ పథకాలు రైతులకు తోడ్పాటు నందిస్తాయని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. మంగళవారం పట్టణం లోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధానమంత్రి కిసా న్‌నిధి 17వ విడతప్రసార కార్యక్రమాన్ని వ్యవ సాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలో 29 వేల మంది రైతులకు కిసాన్ సమ్మాన్‌నిధిని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉత్తరప్రదేశ్ లోని వారణాశిలో విడుదలచేశారు. కార్యక్ర మంలో కేవీకేప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి, ఆర్డీవో రంగయ్య, వ్యవసాయశాఖ జేడీ కె.శ్రీధర్, ఆత్మపీడీ రామ చంద్రరావు, వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి చిట్టిబాబు, వ్యవసాయ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ పైడి వెంకటరావు పాల్గొన్నారు.

ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలి

ఆమదాలవలస: మహిళా స్వయంశక్తి సంఘాల్లోని సభ్యులు ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు సూచించారు. మంగళవారం మండలంలోని సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద గల తులగాం ఆర్ఆర్ కాలనీలో సర్పంచ్ సొండి దమయంతి ఆధ్వర్యంలో స్వయంశక్తి సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బండి ప్రభావతి, గ్రామ పెద్దలు గొర్లె రాఘవదాసు, నారాయణదాసు, కృష్ణమూర్తి, క్లస్టర్ కోఆర్డినేటర్ రామప్పడు, వీవో రేవతి, గ్రామ సంఘం అధ్యక్షు రాలు లంక చిన్నమ్మి, తదితర సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో విజయం

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలో బీజేపీ, టీడీపీ, జనసేన నేతల సమష్టి కృషితో కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు విజయం సాధించారని బీజేపీ నాయకులు అభిప్రాయ పడ్డారు. మంగళవారం మండలంలోని అరిణాం అక్కివలసలో బీజేపీ మండల సమావేశం జరిగింది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజ్జాడ శ్రీనివాసరావు, కోకన్వీనర్ సంపతిరావు నాగేశ్వరరావు, బీజేపీ మండలాధ్యక్షుడు పుంగ్రోతు శంకరరావు, పార్టీ నేతలు తమ్మినేని గోవిందరావు, కొణతం శ్రీదర్, జీరు శ్రీనురెడ్డి, సనపల రామారావు పాల్గొన్నారు.

చందాలతో గ్రోయిన్ మరమ్మతులు

ఇచ్ఛాపురం: మండలంలోని బెల్లుపడ వద్ద ఉన్న గ్రోయిన్ మరమ్మతులకు కస్పా, జాలారి, గౌడు, గొల్ల, కేంద్రవీధి రైతులు చందాలువేసుకుని మరమ్మతు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ గ్రోయిన్ ద్వారా 1800 ఎకరాలకు నీరందుతుంది.అయితే ఈ గ్రోయిన్ దెబ్బతినడంతో మరమ్మతులకు రైతులు మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు.ఈమేరకు రైతులు సుమారు రూ.3లక్షలు చందాలువేసుకొని మరమ్మతులకు సిద్ధంచేశారు. కార్యక్రమంలో ఆశి జీవులరెడ్డి గిన్ని చిన్నరెడ్డి, బడే దొరబాబు, తిప్పన కూర్మారావు, పిలక యాదవ రెడ్డి, ఎదురు రాజు, నీలాపు డిల్లి, దీర్ఘాసి శేఖర్, హేమయ్య ఉప్పాడ రాజు పాల్గొన్నారు.

పార్టీ నిర్ణయాన్ని గౌరవించండి

పొందూరు:పార్టీ, అధినేత నిర్ణయాలను ప్రతిఒక్కరూ గౌరవించాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సూచించారు. మంగళవారం విజయవాడలోని రవికుమార్‌ను టీడీపీ మండలాధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, తెలుగుయువత జిల్లా ప్రధానకార్యదర్శి బలగ శంకర భాస్కర్, తోలాపి మాజీ సర్పంచ్ పొన్నాడ రామారావు, సువ్వారి మధు కలిశారు.

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించండి

పొందూరు: కింతలిలో ఆక్రమణకు గురవుతున్న సర్వే నంబర్ 47-17 లో ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని మాజీ సర్పంచ్ దవళ గణపతి రెవెన్యూ అధికారుల కోరారు. తాను సర్పంచ్‌గా పనిచేసిన కాలంలో ఈ స్థలంలో చెత్త సంపద తయారీకేంద్రం నిర్మించినట్లు పేర్కొన్నారు. ఆ సమయంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈ స్థలం తనదని పట్టాపాస్‌బుక్ తీసుకువచ్చారని తెలిపారు. ఈ విషయంపై విచారణ జరిపిన అప్పటి తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి ప్రభుత్వస్థలమని నిర్ధారించారని పేర్కొన్నారు. మళ్లీ ఇదేస్థలాన్ని అదే వ్యక్తి ఆక్రమణకు పాల్పడుతున్నారని మంగళవారం గణపతి తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

కొండలరావు సేవలు ఆదర్శం

రణస్థలం: రచయిత, నామ విజ్ఞానవేత్త వాండ్రంగి కొండలరావు విద్యా, పత్రికారంగాల్లో చేసిన సేవలు ఆదర్శప్రాయమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం రణస్థలంలో జరిగిన ఓ కార్యక్రమంల వాండ్రంగి కొండలరావును సత్కరించారు. ఊరి పేర్ల విజ్ఞాన విభాగంలో కొండలరావు రాసిన రెండో పుస్తకాన్ని ఎంపీకి అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత సూపరింటెండెంట్ బోను ఈశ్వరరావు, శ్రీశయన సంఘ నాయకుడు పోలాకి నాగభూషణరావు, వాణిజ్యవేత్తలు గుడ్ల అన్నాజీరావు, నారాయణశెట్టి శ్రీనివాసరావు, విశ్రాంత ఉపాధ్యాయులు ఎం.సంజీవరావు, ఎల్వీ రమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఆమదాలవలస:మునిసిపాలిటీ పరిధిలోని ఐదో వార్డు అక్కివలస ప్రాథమికపాఠశాలలో విద్యార్థులకు టీడీపీ నాయకులు తంగి గురయ్య మంగళవారం పుస్తకాలను పంపిణీచేశారు. సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం జడ్పీ ప్రభుత్వఉన్నత పాఠశాలలో టీడీపీ నాయకులు కిల్లి సిద్దార్థ, కిల్లి శేషు, వెంకటప్పలనాయుడు విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

●**బూర్జ:** మండలంలోని పెద్దపేట పంచాయతీ ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు కిట్లును అందించారు.

విధుల్లోకి తీసుకోవాలి

బూర్జ: తమను విధుల్లోకి తీసుకోవాలని వలంటీర్లు కోరారు. మంగళవారం ఎంపీడీవో రవీంద్రబాబు, ఎంపీపీ దీప, జడ్పీటీసీ రామారావుకు వినతిపత్రం అందించారు. గతంలో తాము బలవంతంగా రాజీనామాలు చేయాల్సి వచ్చిందని తెలిపారు.వైసీపీ నాయకులు మాటలు నమ్మి తాము జీవనోపాధిని కోల్పోయామని వాపోయారు.

పొందూరులో 'బడికిపోదాం'

పొందూరు: పొందూరు ఎంపీపీ-1 పాఠశాలలో బడికి పోదాం కార్యక్రమం మంగళవారం విద్యాశాఖాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి పట్టణంలో ర్యాలీ చేశారు. తల్లిదండ్రులు ఐదేళ్ల నిండిన పిల్లలను తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో-12 రామరాజు, పి.రాజారావు, ఎస్ఎస్ఏ ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ పి.జనార్దనరావు, హెచ్ఎం విజయ్‌కుమార్, బాల కార్మికశాఖ అధికారులు, సీఆర్పీలు పీటీఐలు పాల్గొన్నారు.